రిజర్వేషన్లపై నిర్ణయం వారిదే

శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలే తేల్చాలి.. కోటా ప్రయోజనాలు పొందిన వారిని రిజర్వేషన్ల నుంచి మినహాయించడంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, జనవరి 9: రిజర్వేషన్ ప్రయోజనాలను పొంది, ఇతరులతో పోటీ పడగలిగే స్థితిలో ఉన్న వారిని రిజర్వేషన్ల నుంచి మినహాయించాలా అనేది శాసన, కార్యనిర్వాహక వ్యవస్థ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎస్సీ వర్గీకరణపై నిర్ణయం తీసుకునే అధికారాలు రాష్ట్రాలకు ఉన్నాయని గత ఆగస్టులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఒక కీలక తీర్పు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీల్లోనూ క్రిమీలేయర్ గుర్తించేందుకు రాష్ట్రాలు ఒక విధానాన్ని రూపొందించాలని ఈ ధర్మాసనంలో భాగమైన జస్టిస్ బీఆర్ గవాయి అప్పుడే ఒక ప్రత్యేక తీర్పు ఇచ్చారు. ఆరు నెలలైనా రాష్ట్రాలు ఈ విధానాన్ని రూపొందించలేదని పేర్కొంటూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను గురువారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసిహ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. 'గత 75 ఏండ్లను పరిగణనలోకి తీసుకొని, ఇప్పటికే కోటా ప్రయోజనాలు పొంది, ఇతరులతో పోటీ పడగల వారిని రిజర్వేషన్ల నుంచి మినహాయించాలని మేము ఇప్పటికే మా అభిప్రాయాన్ని స్పష్టం చేశాం. కానీ, ఈ నిర్ణయం తీసుకోవాల్సింది కార్యనిర్వాహక, శాసన వ్యవస్థలే' అని జస్టిస్ గవాయి వ్యాఖ్యానించారు. రాష్ట్రాలు విధానాన్ని రూపొందించవని, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరగా.. 'శాసనసభ్యులు ఉన్నారు, వారు చట్టం చేయగలరు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించాల్సిందిగా న్యాయవాది కోరగా.. కోర్టు అంగీకరించింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ అటెంప్ట్‌ల తగ్గింపుపై విచారణ

జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ)-అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యేందుకు గతంలో మూడు ప్రయత్నాలకు అవకాశం ఉండేది. జాయింట్ అడ్మిషన్ బోర్డు (జేఏబీ) ఈ పరీక్షలను నిర్వహిస్తుంది. గత ఏడాది నవంబరు 5న జేఈఈ-అడ్వాన్స్‌డ్, 2025 కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌లో మూడు ప్రయత్నాలు చేయవచ్చునని చెప్పింది. కానీ అదే నెల 18న ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఈ సంఖ్యను రెండుకు కుదించింది. ఇది నిరంకుశత్వమని, విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ నెల 10న దాఖలైన ఇదే తరహా పిటిషన్‌తో కలిపి విచారణ జరపబోతున్నది.

స్వలింగ పెళ్లిళ్లపై తీర్పు సమీక్షకు నో

తీర్పులో తప్పులు లేవన్న సుప్రీంకోర్టు

స్వలింగ పెళ్లిళ్లకు చట్టబద్ధత కల్పించడానికి తిరస్కరిస్తూ 2023 అక్టోబరులో ఇచ్చిన తీర్పును సమీక్షించేందుకు సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. ఈ తీర్పులో తప్పులు లేవని, దానిలో జోక్యం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. రివ్యూ పిటిషన్లను ఐదుగురు న్యాయమూర్తులు చాంబర్స్‌లో పరిశీలించి, ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ పిటిషన్లపై ఓపెన్ కోర్టులో విచారణకు గతంలోనే తిరస్కరించిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఎస్ రవీంద్ర భట్, జస్టిస్ హిమ కోహ్లీ ఇచ్చిన తీర్పును, ఈ మెజారిటీ తీర్పునకు మద్దతుగా జస్టిస్ పీఎస్ నరసింహ ఇచ్చిన తీర్పును పరిశీలించామని, ఈ తీర్పుల్లో ఎటువంటి తప్పులు లేవని వివరించింది.

కుమార్తె చదువు బాధ్యత తల్లిదండ్రులదే

ఖర్చులను తల్లిదండ్రులే భరించాలి

ఇది చట్టబద్ధ హక్కు: సుప్రీం

న్యూఢిల్లీ: చదువుకోవడానికి అయ్యే ఖర్చులను తల్లిదండ్రుల నుంచి పొందే హక్కు కుమార్తెలకు ఉందని సుప్రీంకోర్టు చెప్పింది. ఇది కుమార్తెలకు గల తోసిపుచ్చలేని, చట్టబద్ధంగా అమలు చేయదగిన, ప్రామాణిక హక్కు అని వివరించింది. భార్యాభర్తలు విడిపోయిన కేసులో, వారి కుమార్తె ఐర్లాండ్‌లో చదువుకుంటున్నారు. భర్త తన భార్యకు, కుమార్తెకు కలిపి రూ.73 లక్షలు చెల్లించేందుకు అంగీకరించారు. ఈ సొమ్ములో రూ.43 లక్షలు తన కుమార్తె చదువు ఖర్చుల కోసం ఇస్తున్నట్లు తెలిపారు. భార్య రూ.30 లక్షలు స్వీకరించారు. భార్యాభర్తలిద్దరూ వేర్వేరుగా జీవిస్తున్నారు. కుమార్తె కోసం తండ్రి రూ.43 లక్షలు పంపించగా, ఆమె తిరస్కరించింది. ఈ సొమ్మును తీసుకునేందుకు చట్టబద్ధ హక్కు కుమార్తెకు ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది.

అందుబాటులోకి భారతీయుల జన్యు విశ్లేషణ

ఔషధాల తయారీకి ఉపయోగం

న్యూఢిల్లీ, జనవరి 9: జన్యుసంబంధ వ్యాధులపై పరిశోధనలకు, ఔషధాల తయారీకి ఉపయోగపడే భారతీయుల జన్యు విశ్లేషణ సమాచారం అందుబాటులోకి వచ్చింది. జీనోమ్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా 10 వేల మంది దేశ ప్రజల జన్యువులను విశ్లేషించి ఈ డాటాను తయారుచేశారు. ఢిల్లీలో జరిగిన జీనోమిక్స్ డాటా కాంక్లేవ్‌లో ఈ డాటాను విడుదల చేశారు. పరిశోధకులకు ఉపయోగపడేలా ఇండియన్ బయోలాజికల్ డాటా సెంటర్(ఐబీడీసీ) పోర్టల్‌లో ఈ డాటాను అందుబాటులో ఉంచారు. భారతీయ జనాభా ప్రత్యేక జన్యు నమూనాలను అర్థం చేసుకునేందుకు ఈ డాటా కీలకమని, జన్యు జీవసాంకేతిక విజ్ఞాన పరిశోధనల్లో ఇది మైలురాయిగా నిలువనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ కాంక్లేవ్‌ను ఉద్దేశించి ఆయన తన వీడియో సందేశాన్ని పంపించారు.

పాస్‌పోర్టు సూచీలో దిగజారిన భారత్ ర్యాంకు

5 పాయింట్లు తగ్గి 85వ స్థానం

న్యూఢిల్లీ, జనవరి 9: ప్రపంచ పాస్‌పోర్టు సూచికలో భారత్ ర్యాంకు దిగజారింది. ఐదు పాయింట్లు తగ్గి 85వ స్థానంలో నిలిచింది. సింగపూర్ వరుసగా రెండోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ సంస్థ విడుదల చేసిన హెన్లీ పాస్‌పోర్టు సూచీ 2025 ప్రకారం భారత్ 2024లో లభించిన 80వ స్థానం కన్నా ఐదు పాయింట్లు దిగజారి 85వ స్థానంలో నిలిచింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వరుసగా 103, 101 స్థానాల్లో, అమెరికా 9, చైనా 60, జపాన్ 2, కెనడా 7 స్థానాల్లో నిలిచాయి. 2006-2025 మధ్య డాటా పరిశీలిస్తే భారత్ 2021లో అతి తక్కువగా 91, 2021లో అత్యధికంగా 71వ ర్యాంక్ పొందింది. గత 10 ఏండ్లుగా పాస్‌పోర్టు సూచీలో ర్యాంకింగ్ స్థాయి దిగజారుతూ వస్తున్న మొదటి ఐదు దేశాలలో వెనిజులా, అమెరికా, వనౌతు, బ్రిటన్, కెనడా ఉన్నాయి.

ఇచ్చట జబ్బు పడటం నిషేధం

రోమ్, జనవరి 9: ఇటలీలోని బెల్కాస్ట్రో అనే పట్టణ మేయర్ వింత ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలో అనారోగ్యానికి గురికావడం, ముఖ్యంగా అత్యవసర స్థితిని తెచ్చుకోవడం నిషేధం అంటూ మేయర్ అంటోనియో టార్చియా ఉత్తర్వులు ఇచ్చారు. ఇటలీలోని దక్షిణ ప్రాంతంలో ఉన్న ఈ చిన్న పట్టణంలో 1,300 జనాభా నివసిస్తున్నారు. ఇందులో సగం మంది వృద్ధులే. అయితే, ఈ పట్టణంలో ప్రజలకు సరైన వైద్య సదుపాయాలు లేవు. గతంలో ఉన్న ఓ ఆరోగ్య కేంద్రం మూతబడింది. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించేందుకు వారాంతాలు, సెలవుల్లో వైద్యులు అందుబాటులో ఉండరు. దీంతో 45 కిలోమీటర్ల దూరంలోని కాటాన్జారో నగరానికి వెళ్లి వైద్యం పొందాలి. ఈ నేపథ్యంలోనే పట్టణంలో ఎవరూ అనారోగ్యానికి గురికావొద్దని ఉత్తర్వులు ఇచ్చినట్టు మేయర్ తెలిపారు. వైద్య సదుపాయాలు లేని అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ నిర్ణయమని చెప్పారు. పట్టణ ప్రజలు తరచూ ఇల్లు విడిచి బయటకు వెళ్లొద్దని, ప్రయాణాలు చేయవద్దని, క్రీడలు ఆడవద్దని, ఎక్కువ సమయం విశ్రాంతి తీసుకోవాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పిల్లల్ని కంటే రూ.84 వేలు

మాస్కో, జనవరి 9: 'అమ్మాయిలూ.. పిల్లల్ని కనండి.. మీకు వేల రూపాయల ప్రోత్సాహం అందిస్తాం' అంటూ విద్యార్థినులను వేడుకుంటున్నది రష్యా ప్రభుత్వం. రోజురోజుకు తగ్గుతున్న జనాభాపై ఆందోళన చెందుతున్న క్రమంలో రష్యా వారికి ఈ ఆఫర్‌ను ప్రకటించింది. జపాన్, చైనా తరహాలోనే రష్యాలో కూడా వృద్ధుల సంఖ్య పెరుగుతూ యువత సంఖ్య బాగా తగ్గిపోతున్నది. ఈ అంతరాన్ని తగ్గించడానికి పిల్లలను కనమంటూ ఆయా ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. అందులో భాగంగా రష్యా కూడా 25 ఏండ్ల లోపు యువ విద్యార్థినులు బిడ్డకు జన్మనిస్తే వారికి 1,00000 రూబెల్స్ (సుమారు రూ.84,000) ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించినట్టు మాస్కో టైమ్స్ వెల్లడించింది. వారు కరేలియా వాసులై ఉండి స్థానిక విశ్వవిద్యాలయం, లేదా కళాశాలలో చదువుతూ ఉండాలని నిబంధన విధించింది.

ఏ పనీ చేయడు.. లక్షల్లో ఆదాయం

టోక్యో: ఉపాయం ఉండాలే కానీ పని చేయకపోయినా లక్షలు సంపాదించొచ్చు అని నిరూపిస్తున్నాడు జపాన్‌కు చెందిన షోజి మోరిమోటో(41). చొరవ తీసుకొని పని చేయడం లేదనే కారణంతో 2018లో ఇతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో ఆయన ఒక కొత్త కెరీర్‌ను ప్రారంభించాడు. సహచర్యం కోసం తనను ఎవరైనా అద్దెకు తీసుకోవచ్చని ప్రకటించాడు. అయితే, సహవాసం అంటే శారీరక సంబంధం కాదని నిబంధన కూడా పెట్టాడు. ఇతగాడి ప్రకటన విని కొందరు ఆశ్చర్యపోయారు. ఇంకొందరు అద్దెకు తీసుకోవడం ప్రారంభించారు. అద్దెకు తీసుకున్న వ్యక్తితో కలిసి ప్రయాణించడం, షికార్లకు వెళ్లడం వంటివే మోరిమోటో చేసే పనులు. ఇలా తనను అద్దెకు తీసుకునే వారి నుంచి 2-3 గంటలకు దాదాపు రూ.15 వేల వరకు తీసుకుంటాడు. ఇలా గత ఏడాది ఏకంగా రూ.69 లక్షలు సంపాదించాడు.

శంభు సరిహద్దు వద్ద మరో రైతు ఆత్మహత్య

మూడు వారాల వ్యవధిలో ఇది రెండోది

పాటియాల, జనవరి 9: డిమాండ్ల సాధన కోసం పంజాబ్-హర్యానా సరిహద్దు శంభు వద్ద ధర్నాలో ఉన్న రైతు ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. 55 ఏండ్ల రైతు గురువారం విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడని, గత మూడు వారాల వ్యవధిలో ఇది రెండో ఆత్మహత్యని రైతు నేతలు తెలిపారు. తరన్ తరన్ జిల్లా పహువింద్‌కు చెందిన రేషమ్ సింగ్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా, అతడిని పాటియాలలోని రేషమ్ సింగ్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు.కాగా, రంజోధ్ సింగ్ అనే మరో రైతు డిసెంబర్ 18న ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.

రైతు సంఘాలన్నీ ఏకతాటిపై నిలవాలి

సమస్యల పరిష్కారానికి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని దీటుగా ఎదుర్కోవడానికి దేశంలోని రైతు సంఘాలంతా ఏకం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. పంజాబ్‌లోని మోగలో జరిగిన మహాపంచాయత్‌లో నేతలు మాట్లాడుతూ రైతుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రైతు సంఘాల ఐక్యతపై ఎస్‌కేఎంకు చెందిన 101 మంది రైతులతో శుక్రవారం కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ మోర్చా, సంయుక్త్ కిసాన్ మోర్చా (రాజకీయేతర) నేతలను కలవనున్నట్టు చెప్పారు.

ఫిబ్రవరి 24,25న దేశవ్యాప్త సమ్మె

కేంద్రానికి బ్యాంకు ఉద్యోగుల హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఫిబ్రవరి 24, 25న దేశవ్యాప్తంగా బంద్ నిర్వహిస్తామని అఖిల భారత బ్యాంకు అధికారుల సంఘం (ఏఐబీఓసీ) హెచ్చరించింది. బ్యాంకు ఉద్యోగులకు అయిదు రోజుల పని దినాలు, పీఎల్ఐ(ప్రతిభ ఆధారిత ప్రోత్సాహకాలు), పనితీరు సమీక్షపై ఆర్థిక సేవల విభాగం జారీ చేసిన తాజా మార్గదర్శకాలను ఉపసంహరించుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో(పీఎస్‌బీలు) సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని కోరింది. అవసరమైతే కఠిన కార్యాచరణకు దిగుతామని.. ఈ నెలలో బంద్ నోటీస్ ఇచ్చిన తర్వాత ధర్నాలు మొదలవుతాయని వెల్లడించింది. పీఎస్‌బీల విధాన నిర్ణయాలను ఆర్థిక సేవల శాఖ ఎక్కువగా నియంత్రించాలని చూడటం ఆయా పీఎస్‌బీ పాలక మండళ్ల స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీస్తున్నదని ఏఐబీఓసీ ఆరోపించింది.

10% తగ్గనున్న వరి ఉత్పత్తి

భారత్‌పై వాతావరణ మార్పుల ప్రభావం

న్యూఢిల్లీ, జనవరి 9: భారత్‌లో వాతావరణ మార్పుల ప్రభావం వల్ల భవిష్యత్తులో వరి, గోధుమల దిగుబడులు 6-10 శాతం తగ్గుతాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) అంచనా వేసింది. ఇది చౌక ధరల ఆహారంపై ఆధారపడిన లక్షలాది మందిని ప్రభావితం చేస్తుందని పేర్కొంది. వాతావరణ మార్పుల కారణంగా సముద్ర జలాలు వేడెక్కి చేపల లభ్యత తగ్గిపోతుందని, ఇది మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభావం చూపుతుందని ఐఎండీ సీనియర్ అధికారులు తెలిపారు. సముద్ర జలాలు ఉపరితలంలో వేడెక్కడం వల్ల చేపలు సముద్రం లోపలికి వెళ్లిపోతుండటమే ఇందుకు కారణమని వారు వెల్లడించారు. జాతీయ ఆవిష్కరణల సంస్థ అంచనా ప్రకారం వరి దిగుబడి 2050 నాటికి 7 శాతం, 2080 నాటికి 10 శాతం తగ్గనుంది. అలాగే 2100 నాటికి దేశంలో గోధుమల దిగుబడి 6-25 శాతం తగ్గనుంది. హిమాలయాల్లో మంచు కరగడం పెరుగుతున్నదని, మంచు పేరుకోవడం తగ్గుతున్నదని... పశ్చిమ అలజడులే ఇందుకు కారణమని ఐఎండీ డీజీ మృత్యుంజయ మహాపాత్ర అన్నారు. నీటి లభ్యత తగ్గిపోనుండటం వల్ల దాని ప్రభావం భారత్, చైనాలోని 200 కోట్ల మంది ప్రజలపై పడుతుందని ఆయన హెచ్చరించారు.

రైతు డిజిటల్ ఐడీలు తప్పనిసరి

పీఎం కిసాన్ కొత్త లబ్ధిదారులపై కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ: రైతులకు పీఎం-కిసాన్ కింద అందించే రూ.6 వేల ఆర్థిక సాయంపై వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకంలోకి కొత్తగా చేరాలనుకునే లబ్ధిదారులు రైతు డిజిటల్ ఐడీలను తప్పనిసరిగా కలిగి ఉండాలని ప్రకటించింది. జనవరి 1 నుంచి దరఖాస్తు చేస్తున్న వారికి ఈ నిర్ణయం వర్తిస్తుందని తెలిపింది. ఇందుకోసం భూరికార్డుల కంప్యూటరీకరణ చేయాలని, తప్పనిసరిగా సాగుదారుల పేర్లు రికార్డుల్లో ఉండేలా చూడాలని రాష్ర్టాలకు ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ ఐడీలు లేకపోయినా ఇప్పటికే పీఎం-కిసాన్ అందుకుంటున్న పాత లబ్ధిదారులకు పథకం కొనసాగుతుంది. దేశంలోని రైతులందరికీ 'కిసాన్ పెహ్‌చాన్ పత్ర' పేరుతో కేంద్రం డిజిటల్ ఐడీలు ఇస్తున్నది. ఇందులో రైతుల పేర్లు, భూకమతానికి సంబంధించిన వివరాలు, పండించే పంటలు, ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాల వివరాలు ఉంటాయి.

గణతంత్ర దినోత్సవాలకు ప్రత్యేక అతిథులుగా సర్పంచులు, కళాకారులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరంలోని కర్తవ్యపథ్‌లో ఈ నెల 26న జరిగే 76వ గణతంత్ర దినోత్సవాలకు సుమారు 10,000 మంది ప్రత్యేక అతిథులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. వీరిలో పారాలింపిక్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, ఉత్తమ పని తీరు కనబరచిన గ్రామాల సర్పంచ్‌లు, చేనేత కళాకారులు, అటవీ, వన్య ప్రాణి సంరక్షకులు ఉన్నారు.

కెనడా పీఎం రేసులో భారత సంతతి నేత

టొరంటో: భారత సంతతి నేత, ఎంపీ చంద్ర ఆర్య కెనడా ప్రధాని పదవికి అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. ''మన దేశాన్ని పునర్నిర్మించడం కోసం, భావి తరాలకు సౌభాగ్యాన్ని అందజేయడం కోసం చిన్న, మరింత సమర్థవంతమైన ప్రభుత్వాన్ని నడపటానికి నేను తదుపరి ప్రధాన మంత్రి పదవికి పోటీలో ఉన్నాను'' అని ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. జస్టిన్ ట్రూడో ఇటీవల ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. చంద్ర ఆర్య కర్ణాటకలోని తుమకూరు జిల్లా, సిరా తాలూకా, ద్వర్లు గ్రామానికి చెందినవారు.

నాణ్యమైన ఇల్లు కట్టివ్వలేదా?..

బిల్డర్‌పై దావా వేయొచ్చు!

- **ఇంట్లోకి చేరాక కూడా వెసులుబాటు**
- **ఢిల్లీ వినియోగదారుల కమిషన్ తీర్పు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): లక్షలు పెట్టి మీరు ఓ ఇల్లు లేదా ఫ్లాట్ కొనుగోలు చేశారు. మూడు, నాలుగు తరాల పాటు నిర్మాణానికి ఏ ఢోకా లేదంటూ విక్రయించే సమయంలో బిల్డర్ నమ్మబలికాడు. కొనుగోలు ఒప్పందం కూడా పూర్తైంది. తీరా.. ఇంట్లోకి చేరాక కొన్నాండ్లకే ఆ ఫ్లాట్ శిథిలావస్థకు చేరితే? ఉండటానికి కూడా ఏ మాత్రం పనికిరాకపోతే? ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొనే సామాన్యులకు ఢిల్లీలోని రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఊరటనిచ్చింది. నాణ్యమైన ఇల్లు కట్టివ్వలేని బిల్డర్‌పై దావా వేసే అవకాశం వినియోగదారుడికి ఉంటుందని తేల్చిచెప్పింది.

అసలేం జరిగింది?

ఢిల్లీలోని ఇంద్రపురీలో మధుబాల అనే మహిళ భర్తతో కలిసి నివసిస్తున్నారు. 1996లో ఓ బిల్డర్ దగ్గరనుంచి ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను వీళ్లు కొనుగోలు చేశారు. కొంతకాలానికి ఆమె భర్త మరణించారు. దీంతో ఆ ఫ్లాట్‌ను తన పేరుమీద మార్చుకోవడానికి, అందులో నివాసం ఉండటానికి ఎంతో కష్టపడ్డారు. అన్ని చిక్కులను పరిష్కరించుకొని చివరకు 2019లో ఫ్లాట్‌లో నివాసానికి సిద్ధమయ్యారు. అయితే, అప్పటికే ఆ ఫ్లాట్ శిథిలావస్థకు చేరింది. నిర్మాణంలో నాణ్యతను పాటించకపోవడంతోనే అతికొద్ది కాలంలోనే ఈ ఫ్లాట్ ఈ స్థితికి చేరినట్టు ఇంజినీర్లు తేల్చిచెప్పారు. దీంతో రూ. 20 లక్షలను ఖర్చు చేసి ఆమె ఫ్లాట్‌ను పునరుద్ధరించుకొన్నారు. అయితే, తనకు నాణ్యతలేనటువంటి ఫ్లాట్‌ను కట్టబెట్టిన బిల్డర్ నుంచి తగిన పరిహారం ఇప్పించాలంటూ జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. అయితే, ఒప్పందం అప్పటికే జరిగిపోవడమే కాకుండా ఫిర్యాదుదారు ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నందున సదరు వ్యక్తిని వినియోగదారుడిగా పరిగణించలేమని జిల్లా వినియోగదారుల కమిషన్ కేసును కొట్టేసింది. దీంతో ఆమె రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు.

అలా కుదరదు

ఫిర్యాదుదారు పిటిషన్‌ను ఇటీవల విచారించిన రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్.. ఒప్పందం పూర్తైన తర్వాతే కాకుండా ఇంట్లో నివసిస్తున్నప్పుడు కూడా ఇంటి నిర్మాణంలో నాణ్యతా లోపాలు కనిపిస్తే.. వినియోగదారుడు సదరు బిల్డర్ నుంచి పరిహారాన్ని కోరవచ్చని చెప్పింది.

ఎంతసేపు భార్యను చూస్తారు?

- *ఆదివారాలూ ఆఫీసుకు రండి*
- *వారానికి 90 గంటలు పని చేయాలన్న ఎల్ అండ్ టీ చైర్మన్*

వారానికి 90 గంటల పని చేయాలి

న్యూఢిల్లీ, జనవరి 9: ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఆయన వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఎల్అండ్‌టీ ఉద్యోగులతో ఇటీవల ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో వారానికి ఆరు రోజుల పని విధానాన్ని అమలు చేయడాన్ని ఓ ఉద్యోగి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా.. 'ఆదివారాలు కూడా మీతో పని చేయించలేకపోతున్నందుకు నేను బాధపడుతున్నాను. మీతో ఆదివారాలు సైతం పని చేయిస్తే చాలా సంతోషపడతాను. ఎందుకంటే, నేను ఆదివారాలు కూడా పని చేస్తున్నాను. ఎంతసేపు ఇంట్లో కూర్చుంటావు? ఎంతసేపు నీ భార్యను అలా తదేకంగా చూస్తూ ఉండగలవు? ఆఫీసుకు వెళ్లి పని చేయడం ప్రారంభించు' అని ఆయన వ్యాఖ్యానించారు.

సుబ్రహ్మణ్యన్ అంతటితో ఆగిపోలేదు. వారానికి 90 గంటలు పని చేయాలని సైతం ఆయన సెలవిచ్చారు. తాను ఒక చైనా వ్యక్తితో మాట్లాడానని, చైనా కార్మికులు వారానికి 90 గంటలు పని చేస్తారని, అమెరికన్లు 50 గంటలే పని చేస్తారు కాబట్టి కొన్ని రోజుల్లో అమెరికాను చైనా దాటేస్తుందని ఆ వ్యక్తి చెప్పినట్టు సుబ్రహ్మణ్యన్ చెప్పుకొచ్చారు. 'మీరు కూడా ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే వారానికి 90 గంటలు పని చేయాల్సిందే. ముందుకొచ్చి పని చేయండి' అని ఆయన పిలుపునిచ్చారు. ఆయనపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలను చిన్నచూపు చూసేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు.



మరణం మరింత దూరం

- **క్రయోప్రిజర్వేషన్ వ్యవస్థ అభివృద్ధి**
- **ప్రాణాంతక వ్యాధులు ఉన్న వారిని ఇందులో సంరక్షించే అవకాశం**

న్యూయార్క్: ప్రాణాంతక వ్యాధుల బారిన పడ్డ వారి ఆయుష్షు పెంచేందుకు ఉపయోగపడే ప్రపంచంలోని మొదటి క్రయోప్రిజర్వేషన్ వ్యవస్థను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఏఐ శాస్త్రవేత్త, యాంటీ ఏజింగ్ పరిశోధకుడు డాక్టర్ అలెక్స్ ఝూవోరోన్కోవ్, మాలిక్యూలర్ బయాలజిస్ట్ హషేమ్ అల్ ఘైలి కలిసి 'టైమ్‌షిఫ్ట్' పేరుతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశారు. ప్రాణాంతక వ్యాధుల బారిన పడ్డ వారిని ఈ క్రయోప్యాడ్‌లలో పెడితే వారి ఆరోగ్యం మరింత క్షీణించకుండా చూడొచ్చని, వారి న్యూరోడీజెనరేటివ్ వ్యాధులు, క్యాన్సర్ల అభివృద్ధిని తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. కొన్నేండ్ల పాటు మనుషులను వీటిల్లో పెట్టవచ్చని, తద్వారా వారికి అందించాల్సిన చికిత్సను అభివృద్ధి చేసేందుకు పరిశోధకులకు సమయం లభిస్తుందని తెలిపారు. ఈ క్రయోప్యాడ్‌లలో -196 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. ఇంత తక్కువ ఉష్ణోగ్రతలో మంచు ఏర్పడకుండా కొన్ని గ్యాస్‌లను, క్రయోప్రొటెక్టన్స్‌లను వాడతారు. సాధారణంగా మృతదేహాన్ని ఎక్కువ కాలం భద్రపరచడానికి ఇలా తక్కువ ఉష్ణోగ్రతల్లో భద్రపరుస్తారు. తాము మొదటిసారి జీవించి ఉన్న మనుషులను కాపాడేందుకు ఈ క్రయోప్యాడ్‌లను తయారుచేసినట్టు శాస్త్రవేత్తలు చెప్పారు. మనిషి ఈ ప్యాడ్‌లో ఉన్నప్పుడు వారి సన్నిహితులు మాట్లాడటానికి ఒక ఏఐ ఆధారిత అవతార్‌ను సైతం తయారు చేస్తామని తెలిపారు.

ముగ్గురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

ఖమ్మం, జనవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా-బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో గురువారం జరిగింది. గుంద్రాతిగూడెం-పల్లిగూడెం అడవుల్లో భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించాయి. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురు కాల్పులకు దిగారు. ఇరువర్గాల మధ్య రెండు గంటల వ్యవధిలో రెండు, మూడుసార్లు ఎదురు కాల్పులు జరిగాయి. కాసేపటికి జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. ఘటనా స్థలం నుంచి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు తుపాకులు, ఇతర మారణాయుధాలు, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో క్యాడర్ ఉన్న మావోయిస్టులు ఉన్నట్లు తెలుస్తోంది.

రూ. 4.89 లక్షల కోట్లు బుగ్గి

అమెరికాకు భారీ నష్టాన్ని మిగిల్చిన కార్చిచ్చు

ఐదుగురు మృతి..

1.37 లక్షల మంది తరలింపు



లాస్‌ఏంజెల్స్: అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌ను కబళించిన భారీ కార్చిచ్చు ఆ దేశానికి భారీ నష్టాన్ని మిగిల్చింది. ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా మరణాల సంఖ్య ఐదే ఉన్నప్పటికీ భారీగా ఆస్తి నష్టం సంభవించింది. 2 వేలకు పైగా విలాసవంతమైన భవనాలు బూడిదయ్యాయి. కాలిఫోర్నియాకు మునుపెన్నడూ లేనంతగా ప్రకృతి వైపరీత్యం కారణంగా 4.89 లక్షల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లినట్టు ఆక్యూవెదర్.ఐఎన్‌సీ ప్రకటించింది. అంతేకాకుండా ఈ విపత్తు వల్ల ఏర్పడిన పొగ, ఇతర విష వాయువుల కారణంగా పౌరులకు భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలు ఏర్పడటంతో పాటు ఈ ప్రాంత పర్యాటకంపై ప్రభావం పడుతుందని తెలిపింది.

హాలీవుడ్‌కు పొంచి ఉన్న ముప్పు

హాలీవుడ్ ఐకానిక్ కట్టడాలను కూడా మంటలు చుట్టుముట్టే ప్రమాదం ఏర్పడింది. తాజాగా గురువారం రాన్యాన్ కాన్యాన్, వాటిల్స్ పార్క్ మధ్య 20 ఎకరాల్లో కార్చిచ్చు వ్యాపించినట్టు అధికారులు ప్రకటించారు. హాలీవుడ్ చిహ్నంతో పాటు, ఏటా ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరిగే డాల్బీ థియేటర్‌కు కూడా ఈ సన్‌సెట్ ఫైర్ ముప్పు పొంచి ఉంది. కొందరు హాలీవుడ్ సెలబ్రెటీల గృహాలు ఇప్పటికే కార్చిచ్చులో దగ్ధం అయ్యాయి. సంపన్నులు, సెలబ్రిటీలు అధికంగా నివసించే లారెల్ కాన్యన్ బైలేవార్డ్, ముల్హోలాండ్ డ్రైవ్‌లోని పలు నివాసాలను అధికారులు బుధవారం సాయంత్రం ఖాళీ చేయించారు. లాస్‌ఏంజెల్స్, దాని పరిసరాల్లో ఉన్న వెంచురా కౌంటీలో ఆరు ప్రదేశాల్లో మంటలు చెలరేగుతున్నాయి.

1,37,000 మంది తరలింపు

కార్చిచ్చు ప్రమాదాల్లో మృతుల సంఖ్య ఐదుకు చేరుకుంది. ఇప్పటివరకు 1,37,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బుధవారం మధ్యాహ్నానికి దేశంలో 15 లక్షల మంది విద్యుత్తు సౌకర్యం లేక అంధకారంలో మగ్గారు.

పిల్లల మొబైల్ వినియోగంపై ఆంక్షలు!

గుజరాత్ ప్రభుత్వం యోచన

అహ్మదాబాద్, జనవరి 9: నేటి సమాజంలో చదువు కన్నా మొబైల్ చూడటంలోనే పిల్లలు ఎక్కువ సమయాన్ని గడుపుతున్నారు. ఇది తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పెద్ద తలనొప్పిగా మారింది. అయితే పిల్లల మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల వినియోగంపై ఆంక్షలు, పరిమితులు విధించాలని గుజరాత్ ప్రభుత్వం యోచిస్తున్నది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తానని గురువారం ప్రకటించింది. పిల్లలను మొబైల్స్, సామాజిక మాధ్యమాలకు దూరం చేసి వారిని ఆటస్థలాలు, చదువుకు దగ్గర చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా మీడియాకు తెలిపారు. నిపుణులతో సంప్రదించిన తర్వాత దీనిపై మార్గదర్శకాలు విడుదల చేస్తామని ఆయన చెప్పారు. కాగా, ఇటీవల ఆస్ట్రేలియా 16 ఏండ్ల లోపు వారు సామాజిక మాధ్యమ వినియోగంపై నిషేధం విధించింది.